క్లుప్తంగా

రైతు బజారుల్లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు
టమాటా రూ.11, వంకాయ 45, బెండ 23, పచ్చి మిర్చి 28, కాకర 23, బీర 28, క్యాబేజీ 16, ఫ్రెంచిబీన్స్ 85, క్యారెట్ 30, దొండ 23, చిక్కుడు 40–65, గోకర 23, బీట్‌రూట్ 19, క్యాప్సికం 47, ఆలు 21, దోస 13, సొర 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 28, చామగడ్డ 37. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మూసారంబాగ్‌లో బతుకమ్మ చీరల పంపిణీ



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ శ్రీపురం కాలనీ ఇండోర్ స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూసీడీ విభాగం ఇన్‌చార్జి రామకృష్ణ పాల్గొన్నారు.

వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

చైతన్యపురి: డిగ్రీ, బీటెక్, ఎంఎస్సీ, ఎంసీఏ, పీజీ చదివిన నిరుద్యోగ యువతకు వెబ్ డెవలపర్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు దిల్‌సుఖ్‌నగర్‌లోని నిర్మాణ్ ఆర్గనైజేషన్ మేనేజర్ ఇమ్రాన్ హసన్ తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించటం జరుగుతుందన్నారు.ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 8008088392 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎల్‌బీనగర్ ఓటర్ల తుది జాబితా విడుదల

ఎల్‌బీనగర్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎల్‌బీనగర్ నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి బుధవారం విడుదల చేశారు. నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లు 566814 మంది ఓటర్లు ఉండగా పురుషులు, 296017, మహిళలు, 270696, ఇతరులు 101మంది ఉన్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 235 ప్రాంతాలు 570 పోలింగ్ బూత్‌లు ఉన్నట్లు వెల్లడించారు.

కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలి

చాదర్‌ఘాట్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఏఐసీసీ పరిశీలకుడు, హైదరాబాద్ పార్లమెంట్ పార్టీ ఇన్‌చార్జ్ అశోక్ జక్తాప్, మాజీ మంత్రి పుష్పలీల అన్నారు. బుధవారం మలక్‌పేటలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు హామీలను ఇంటింటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు వారు దిశానిర్దేశం చేసారు. సమావేశంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి చెకలొకర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి పుష్పలీల, అశోక్ జక్తాప్

రూ. వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



చీరల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

హయత్‌నగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో రూ. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నామని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ముందుండి నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చి దిద్దుతున్నామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్‌లో రూ. 9.50 కోట్లతో చేపట్టనున్న మంచినీటి పైపులైన్, అంతర్గత డ్రైనేజీ, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులకు బుధవారం ఆయన స్థానిక కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటే ఎలాంటి ఆపద వచ్చినా ముందుండి తగిన భరోసాను కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికి అందజేస్తున్నామని, అభివృద్ధిలో భాగంగా మెట్రో రైలును హయత్‌నగర్ వరకు పొడిగిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, వాటర్‌వర్క్స్ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, నాయకులు భాస్కర్‌సాగర్, గుడాల మల్లేష్, మల్లీశ్వరిరెడ్డి, రాకేష్, గుత్తా లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ..

నాగోలు: అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు, బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బతుకమ్మ చీరలను బుధవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. బతుకమ్మ పండుగ పూట మహిళలు ఆనందంగా ఉండాలనే సంకల్పంతో చీరలను కానుకగా సీఎం కేసీఆర్ అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాగోలు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, సీనియర్ నాయకులు అనంతుల రాజా రెడ్డి, మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, కటేపాక రవి, ప్రమీల రాణి పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు..

చంపాపేట: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం డివిజన్‌కు చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. మంద సత్యనారాయణరెడ్డి, సారయ్య, రేండ్ల శివ, దాసరి కృష్ణారెడ్డి, సామ శ్రీకాంత్‌రెడ్డి, మెట్టు వెంకటరెడ్డి పార్టీలో చేరారు.

అక్బర్‌బాగ్‌లో రూ. 4.30 కోట్లతో అభివృద్ధి పనులు



పల్టాన్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. అక్బర్‌బాగ్‌లో కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్‌తో కలిసి బుధవారం డివిజన్ పరిధిలోని కాలనీలలో రూ. 4.30 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వీడీసీసీ, సీసీ రోడ్లకు శంకుస్థాపన, సీవరేజ్, వాటర్ పైపులైన్లు, పల్టాన్ కమ్యూనిటీహాల్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, రెండు ప్రాంతాలలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జీహెచ్ఎంసీ ఈఈ పీర్‌సింగ్, ఏఈ వెంకన్న, వాటర్ వర్క్స్, విద్యుత్‌శాఖ, శానిటేషన్ అధికారులు, మజ్లిస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

‘ప్రారంభోత్సవాల పేరుతో ఎమ్మెల్యే మోసం’



ఎల్‌బీనగర్ ఓల్డ్ విలేజ్‌లో పర్యటిస్తున్న సామ రంగారెడ్డి

లింగోజిగూడ: నిధులు లేకుండా శిలాఫలకాలు వేసి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రజలను మోసం చేసేందుకు తెరలేపారని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని పాతఎల్‌బీనగర్‌లో బుధవారం ఆయన పర్యటిస్తూ మాట్లాడారు. జీహెచ్ఎంసీలో కాంట్రాక్టర్లకు వెయ్యి కోట్లు బకాయిలు ఉన్నాయని చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తే వారు పలుమార్లు ఆందోళనకు దిగారని అన్నారు. చేసిన పనులకే బిల్లులు చెల్లించే దిక్కులేదని ఇప్పుడు కొత్త పనులకు శంకుస్థాపనలు చేస్తే ఈ పనులను ఎవరు చేస్తారని ప్రశ్నించారు. ఆయన వెంట విజయ్‌భాస్కర్, పల్లె గణేశ్‌గౌడ్, కిరణ్, జగదీష్, రమేశ్‌గుప్తా, వెంకటేశ్ గుప్తా, భరత్‌యాదవ్, రాజ్, వి.లక్ష్మణ్ ఉన్నారు.

రైతుబజార్ పరిసర ప్రాంతాల్లో కూరగాయల అమ్మకాలు వద్దు



సరూర్‌నగర్ రైతు బజార్ ఎస్టేట్ అధికారి స్రవంతిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్ నగర్ రైతు బజార్ ముందు రిలయన్స్ పెట్రోల్ బంక్ నుండి పారమిత చిల్డ్రన్స్ హాస్పిటల్ వరకు నేషనల్ హైవేపై ఆటోలో కూరగాయలు తీసుకువచ్చి అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సరూర్‌నగర్ రైతు బజార్‌లో కూరగాయలు విక్రయించే రైతులు ఎస్టేట్ అధికారిని స్రవంతి రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సరూర్‌నగర్ రైతు బజార్ ప్రారంభమైనప్పటి నుండి ఇబ్రహీంపట్నం, యాచారం, ఆరుట్ల, జాపాల, చౌదర్పల్లి తదితర గ్రామాల 40–50 కిలోమీటర్ల దూరం నుండి కూరగాయలు తీసుకువచ్చి అమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నామన్నారు. రైతు బజార్ పరిధిలో రెండు మూడు కిలోమీటర్ల దూరం వరకు ఎలాంటి కూరగాయల అమ్మకూడదని ఉందని అన్నారు. రోడ్డుపై ఆటోలో కూరగాయల విక్రయించడం వల్ల రైతు బజార్లో అమ్మకాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తెచ్చిన కూరగాయలు అమ్ముడు పోక సాయంత్రం సమయంలో పారబోసి ఇంటికి పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. సాయంత్రం సమయంలో రోడ్డుపై ఆటోల విక్రయించడం వల్ల పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తిరుమలమ్మ, లక్ష్మమ్మ, సుగుణ, కొమరమ్మ, బోగరమ్మ, ధనరాజ్ అంజయ్య, శ్రీశైలం, స్వామి గౌడ్, ప్రసాద్, లక్ష్మీనారాయణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో రజక మహిళలకు సీట్లు కేటాయించాలి



నియామక పత్రాలు అందజేస్తున్న పెద్దపూరే బ్రహ్మయ్య

నాగోలు: రజకుల పట్ల అన్ని రాజకీయ పార్టీలు సవతితల్లి ప్రేమ చూపెడుతున్నాయని వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రజక మహిళలకు సీట్లు కేటాయించకపోతే ఎంబీసీ కులాలను కలుపుకొని ఉద్యమిస్తామని తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దపూరే బ్రహ్మయ్య హెచ్చరించారు. నాగోలు సాయినగర్ కాలనీలో తెలంగాణ గాడ్గే రజక సంఘం మహిళ విభాగం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గాడ్గే రజక మహిళ విభాగం గ్రేటర్ ప్రధాన కార్యదర్శిగా పెద్దపూరే కవిత, గ్రేటర్ జాయింట్ సెక్రటరీగా కె. రత్నం, మహేశ్వరం అధ్యక్షురాలిగా కె. లత, ఎల్‌బీనగర్ ఉపాధ్యక్షురాలిగా సరిత, ఉప్పల్ ప్రధాన కార్యదర్శిగా భాగ్య, ఉపాధ్యక్షురాలిగా సుజాతలకు నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దపూరే బ్రహ్మయ్య, గ్రేటర్ అధ్యక్షురాలు బంగారు గీతలకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని రాజకీయ రంగాల్లో మాత్రం మహిళలను ఎదగకుండా అన్ని రాజకీయ పార్టీలు అణగదొక్కుతున్నాయన్నారు. మహిళ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం పొందినప్పటికీ 33 శాతం రిజర్వేషన్ల అమలుకు ఆలస్యమయ్యే అవకాశం ఉందని వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మహిళలకు సీట్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగిళ్ల యాదగిరి, పగిళ్ల వెంకటేష్, గీత, రేణుక, ధన, తులసి, ప్రేమలత, ప్రియాంక, సుమలత పాల్గొన్నారు.

దివ్యాంగుడికి చక్రాల కుర్చీ అందజేత

వనస్థలిపురం: శ్రీ సద్గురు భం అన్వరానంద బాబా వనస్థలిపురం సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం వనస్థలిపురం శ్రీలక్ష్మీగణపతి దేవాలయం వద్ద ఓ వృద్ధ దివ్యాంగుడికి చక్రాల కుర్చీని సమితి ప్రతినిధులు సంజీవరెడ్డి, బద్ధం వినోద్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాయుడు, శ్రీరామ్ అందజేశారు.

పుట్టలమ్మ తల్లికి పూజలు

బడంగ్‌పేట్: పుట్టలమ్మ తల్లి కొలువుదీరిందని భక్తులు పూజలు చేశారు. కొత్తగా నిర్మించిన బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ భవనంలో శానిటేషన్ సిబ్బంది పచ్చగడ్డిని శుభ్రం చేస్తుండగా పుట్టలమ్మ అమ్మవారు వెలిశారని గుర్తించి మహిళా శానిటేషన్ సిబ్బంది బుధవారం కొబ్బరికాయలు కొట్టి, నిమ్మకాయలు కోసి, పసుపు కుంకుమ చల్లి పూజలు చేశారు. పుట్టలమ్మ అమ్మవారిని చూడగానే పూనకాలతో అమ్మవారిని చల్లంగా చూడాలని వేడుకున్నారు.

జల్‌పల్లిలో ఇంద్రారెడ్డి జయంతి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని సబితా ఇంద్రారెడ్డి కాలనీలో బుధవారం ఇంద్రారెడ్డి జయంతిని పురస్కరించుకొని పెద్ద ఎత్తున నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు దూడల శ్రీనివాస్ గౌడ్, యువజన విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల అర్జున్ ఆధ్వర్యంలో జల్‌పల్లి చెరువు కట్ట దిగువన గల ఇంద్రారెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఇంద్రారెడ్డి చేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సబితా ఇంద్రారెడ్డి కాలనీ అధ్యక్షుడు చంద్రం చారి, వెంకటేశ్ నాయక్, బెలగాం సిద్ధు, వీరేశం గుప్తా, విష్ణువర్ధన్ రెడ్డి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మహాలక్ష్మీనగర్‌లో పర్యటిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని మహాలక్ష్మీనగర్, సాయిరామ్ కాలనీలలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో మంచినీటి, డ్రైనేజీ సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాకేశ్, మడుపు సందీప్‌రెడ్డి, యాదయ్య, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, సంజీవరెడ్డి, కోటేశ్వరరావు,చౌదరి, గిరిధర్, గౌస్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభాకర్‌కు ఇండియన్ ఐకాన్స్ అవార్డు



ప్రభాకర్‌కు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

మలక్‌పేట: గ్లోబల్ ఎక్సలెన్సీ ఫోరం నిర్వాహకులు న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో మూసారంబాగ్‌కు చెందిన చిట్టిపాక ప్రభాకర్‌కు సోషల్ సర్వీస్ విభాగంలో ఇండియన్ ఐకాన్స్–2023 అవార్డు అందజేశారు. కేంద్ర మంత్రి రఘువీర్ సింగ్, నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్(ఎన్‌హెచ్ఆర్ఓ) చైర్మన్ రవికుమార్ చేతుల మీదుగా జ్ఞాపిక, సర్టిఫికెట్ తీసుకున్నట్లు ప్రభాకర్ బుధవారం తెలిపారు. ఈ అవార్డుతో తనపై సామాజిక బాధ్యత మరింత పెరిగిందని, మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

చంచల్‌గూడ: షాపు ముందు పార్క్ చేసిన బైక్ చోరీకి గురైన సంఘటన మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకోగా మంగళవారం రాత్రి కేసు నమోదైంది. బాధితుడు మహ్మద్ ముస్తాక్ మాదన్నపేట మార్కెట్‌లో ఎంఎం ట్రేడర్ పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గత నెల 24వ తేదిన రాత్రి 10 గంటలకు తన హోండా షైన్ ద్విచక్రవాహనాన్ని షాపునకు వచ్చిన పక్కనే పార్క్ చేశాడు. వ్యాపారం ముగించుకుని ఇంటికి బయలుదేరుదామని చూడగా తన బైక్ కనిపించలేదు. అన్ని చోట్ల వెతికినా ఫలితం లేకుండా పోయింది. మంగళవారం రాత్రి మాదన్నపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

చంచల్‌గూడ: చావనీలోని డబుల్ బెడ్‌రూమ్ భవనంలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మృతుడి సోదరుడు ఆమీర్‌ఖాన్ తెలిపిన మేరకు.. తన సోదరుడు షాబాజ్ ఖాన్ (21) మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకున్నాడు. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు షాబాజ్‌ను నిద్ర లేపేందుకు వెళ్లగా అతని బెడ్ షీట్‌తో ఉరి వేసుకుని ఉండటం కనిపించింది. దీంతో మాదన్నపేట పోలీసులక సమాచారం ఇచ్చారు. అనుమానస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేగంగా అభివృద్ధి పనులు



బడంగ్‌పేట్: 1వ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని టీఎస్ఆర్ నగర్ కాలనీలో రూ.13.50 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. సీసీ రోడ్డు పనులను నాణ్యతగా, మన్నికతో చేయాలని అధికారులకు, గుత్తేదారులకు కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

పారిశుద్ధ్య సిబ్బందికి యూనిఫాం పంపిణీ

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి బుధవారం యూనిఫాంలను మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ పంపిణీ చేశారు. విధినిర్వహణలో తప్పనిసరిగా యూనిఫాంలను ధరించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సుమన్‌రావు, ఆర్వో నగేశ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్జున్, బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, ఐలయ్యయాదవ్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.



బధిర విద్యార్థుల నడుమ డీఆర్‌డీఓ డైరెక్టర్ జన్మదిన వేడుకలు



బధిర విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఓ డైరెక్టర్ జీఏ శ్రీనివాస మూర్తి

మలక్‌పేట: ఫిన్ సంస్థ బధిర విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని డీఆర్‌డీఎల్, డీఆర్‌డీఓ డైరెక్టర్ జీఏ శ్రీనివాస మూర్తి అన్నారు. మలక్‌పేట ప్రభుత్వ క్వార్టర్స్‌లోని ఫిన్ బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థుల నడుమ బుధవారం ఆయన జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులకు పండ్లు, గిఫ్టులు అందజేశారు. బధిర చిన్నారుల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఫిన్ ప్రధాన కార్యదర్శి బాల కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న దేవిరెడ్డి కమలాసుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: రానున్న ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సతీమణి దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి కోరారు. బీఆర్ఎస్ మన్సూరాబాద్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ విజయానికి కార్యకర్తలు చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఎల్‌బీనగర్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు మరింత అవగాహన పెంచేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై కార్యకర్తలకు వివరించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగదీష్‌యాదవ్, నాగరాజు, చంద్రమోహన్, ఆజాద్, భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

అన్నీ ఒకే చోట..

- ముస్తాబవుతున్న కార్పొరేషన్ భవనం
- ఈ నెల 7న ప్రారంభం
- రూ.8.5 కోట్లతో నిర్మాణం పూర్తి
- ఆకర్షణగా నిలవనున్న 4లైన్ల రోడ్డు



ముస్తాబవుతున్న కార్పొరేషన్ భవనం

బడంగ్‌పేట్: ఒకప్పుడు చిన్న గ్రామంగా ఉన్న బడంగ్‌పేట క్రమక్రమంగా తెలంగాణ రాష్ట్రంలోనే టాప్4కు చేరుకుంది. గ్రామ పంచాయతీ వ్యవస్థ నుంచి కార్పొరేషన్ దాక అవతరించింది. మార్కెట్ కల్చర్‌కు నిలయంగా మారింది. అందులో భాగంగానే బడంగ్‌పేటలోని దావుత్‌ఖాన్‌గూడలో ఎకరంన్నర విస్తీర్ణంలో విశాలమైన కొత్త కార్పొరేషన్ భవనానికి అంకురార్పణ చేశారు. రెండేళ్ల క్రితం మున్సిపల్, ఐటీ మినిస్టర్ కేటీఆర్ కార్పొరేషన్ భవనానికి శంకుస్థాపన చేశారు. దీంతో ఈ భవన నిర్మాణానికి రూ.8.5 కోట్లతో రెండంతస్తుల్లో పూర్తి చేశారు. ఈ భవనం ముందు ఉన్న రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా రూ.25 లక్షలు వెచ్చించి తీర్చిదిద్దారు. విశాలమైన గదులను ఏర్పాటుచేసి లప్పం, పాల్‌సీలింగ్, గదులన్నింటిని సుందరంగా తీర్చిదిద్దారు.

7న ప్రారంభం..

విద్యాశాఖమంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కోట్లు వెచ్చించి పక్కాభవనం ఏర్పాటునకు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 7న మంత్రి కేటీఆర్ ప్రారంభించేలా మంత్రి సబితారెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. భవనం ముందు రంగులు వేయించే పనిలో కార్పొరేషన్ అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు వేగంగా చేయిస్తున్నారు. ఇప్పటికే దావుత్‌ఖాన్‌గూడలో మున్సిపల్ కార్పొరేషన్ భవనంతో పాటు జిల్లా గ్రంథాలయం, మోడరన్ హైస్కూల్, పక్కనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్, కార్పొరేషన్ భవనం ఎదురుగా ప్రజాభవన్, వీటి ఎదురుగానే పాల్‌టెక్నిక్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, ఇలా అన్ని ఒకే చోట కేంద్రీకృతం అయ్యేలా మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతీసుకున్నారు..



ప్రభుత్వానికి చెందిన అన్ని భవనాలు ఈ డివిజన్‌లో ఏర్పాటు చేస్తుండటం ఆనందంగా ఉంది. ప్రజలకు కావలసిన ప్రభుత్వ సేవలు ఇక్కడే లభించేలా మంత్రి సబితారెడ్డి చొరవతీసుకున్నారు. భవన నిర్మాణానికి సహకారం అందించిన మంత్రి సబితారెడ్డికి, కార్పొరేషన్ పాలకవర్గం సభ్యులకు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు.

– సూర్ణగంటి అర్జున్, కార్పొరేటర్, 28వ డివిజన్

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

హస్తినాపురం: అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేందర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించిన అనంతరం సీఐ జలేందర్‌రెడ్డి విద్యార్థులకు గణితాన్ని బోధించి అబ్బురపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు వినయంతో క్రమశిక్షణతో మెలిగినప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారన్నారు.



విద్యార్థులకు బోధిస్తున్న సీఐ జలేందర్‌రెడ్డి

మూడు కిలోల గంజాయి స్వాధీనం

- ఏడుగురి రిమాండ్



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

చైతన్యపురి: గంజాయిని సరఫరా చేస్తున్న పలువురిని అరెస్ట్ చేసిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సాహితీనగర్ ప్రాంతంలో కొందరు గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. మూడు కేజీల గంజాయి ప్యాకెట్లు, ఆరు ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.